క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం

ఇబ్రహీంపట్నం రూరల్: ముదిరాజ్ కులస్తుల దేవాలయం నిర్మాణానికి జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి విరాళం అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు గంగమ్మ, పెద్దమ్మ దేవాలయాల నిర్మాణం కోసం బూడిద రాంరెడ్డిని విరాళం అడగగా రూ.80 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్‌లు రాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి,గోపాల్, మహేందర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల తహసీల్దార్‌గా పని చేస్తున్న అయప్ప బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శనివారం తహసీల్దార్‌గా కె.వి రంగారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు, శాలువాలతో రంగారెడ్డిని సన్మానించారు. విధి నిర్వహణలో బదిలీలు సహజమని, మనం చేసిన మంచి పనులే సమాజంలో గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, స్వామిగౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకట్‌నారాయణ, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని నిర్మాణ్ ఫౌండేషన్ చైర్మన్ ఏలె వెంకట్ నారాయణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఖానాపూర్ జిల్లా పరిషత ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో పాటు, వినయం విధేయతలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. లక్ష్యంతో చదవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, సతీష్, గోపాల్‌జీ, బాలస్వామి, రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ యాదయ్య పాల్గొన్నారు.

దొరల పాలనకు చరమగీతం

● కర్ణాటక ఎమ్మెల్యే భరత్‌శెట్టి



భరత్‌శెట్టిని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం గట్టి దొరల పాలనకు చరమగీతం పాడాలని కర్ణాటక ఎమ్మెల్యే భరత్‌శెట్టి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే భరతశెట్టి, తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యకకర్తలంతా కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం దళితవాడలో భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ నర్సింహ, కమలేశ్, జిల్లా కార్యదర్శి పాండు, రాష్ట అదనపు కార్యదర్శి పాండు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, బీజేవైఎం కల్వకుర్తి తాలుకా కన్వీనర్ అనిల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తలసానికి స్వాగతం



మొక్కలను నాటుతున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: పెద్ద చెరువులో చేప, రొయ్య పిల్లలను వదిలేందుకు శనివారం విచ్చేసిన మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు గంగపుత్రులు, మత్స్యకారులు ఘన స్వాగతం పలికారు. వేప కొమ్మలు, గాలిబుగ్గలను చేపలు పట్టే వలకు కట్టి అలంకరించారు. మధ్యలో కర్ర సహాయంతో వలను పట్టుకొని తిప్పుతూ బ్యాండ్ మేళాల నడుమ ఆటలాడుతూ మంత్రి తలసాని, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తలసాని తనదైనశైలిలో ప్రసంగించి మత్స్యకారులను ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు.

ఎండుతున్న పంటలు



గడ్డమీదితండాలో ఎండిపోయిన మొక్కజొన్న పంట

కడ్తాల్: వర్షాలు కురవక రైతులు సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. నెల రోజులుగా వర్షాలు కురవకపోవడంతో మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. అప్పులు చేసి సాగు చేసిన పంటలు కళ్లేదుటే ఎండిపోతుండడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. వర్షాధార పంటలుగా సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పంటలు సాగు చేసిన జూలై మాసంలో నెల రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో, పంటలో కలుపు మొక్కలు పెరగడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు వర్షాలు కురిసినా పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదని పలువురు రైతులు వాపోతున్నారు.



ఎండిపోయిన జొన్నపంట

నీట్‌లో సీటు సాధించిన నిరుపేద

● భాస్కర మెడికల్ కాలేజీలో అడ్మిషన్



ప్రవీణ్

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డతండాకు చెందిన సేనావత్ ప్రవీణ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. తండాకు చెందిన పాండు నాయక్, సరోజిని బాయి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమారుడు ఇస్లావత్ ప్రవీణ్ నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎస్టీ రిజర్వేషన్‌లో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నాడు. దీంతో మొయినాబాద్‌లోని భాస్కర మెడికల్ కాలేజీలో సీటు లభించింది. ప్రవీణ్‌ను తండావాసులు అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న ఎంపీపీ, అధికారులు



ఆమనగల్లు: మొక్కలు నాటుతున్న రాంపాల్‌నాయక్, శ్యాంసుందర్ తదితరులు

తలకొండపల్లి: మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధామని ఎంపీపీ తిర్మణీ నిర్మల అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో 750 మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ .. ఇంటింటా మొక్కలు నాటి గ్రామాలను పచ్చగా మార్చాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. విరివిగా మొక్కలు నాటి అడవుల అభివృద్ధికి దోహదపడాలన్నారు. గ్రామ పంచాయతీకి 750 మొక్కల చొప్పున 32 గ్రామ పంచాయతీల్లో సుమారుగా 21 వేల మొక్కలు నాటామని ఏపీఓ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి జానయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సాల్వయ్య, ఏపీఓ కృష్ణ, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం స్వాతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా రాంపాల్ నాయక్ మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అందించే మొక్కలను ప్రతి ఒక్కరు తమ ఇళ్లో నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమీషనర్ శ్యాంసుందర్, డీఈ పిచ్చయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ సర్కారే..



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

● ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ సర్కారే వస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాడ్గుల మండలం నాగిళ్ళ గ్రామానికి చెందిన వందమంది కాంగ్రెస్ నాయకులు పాలకుర్ల రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన యాదయ్య, లక్ష్మయ్య, గోపాల్, జంగయ్య, యాదయ్య, నర్సింహా, మహేశ్, సురేశ్, నరేందర్, రమేశ్, రాజు తదితరులకు ఎమ్మెల్యేగులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఎక్కడా లేనివిధంగా ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంఖర్‌నాయక్, సర్పంచ్ రమేశ్‌రెడ్డి, నాయకులు సత్తయ్య, చెన్నయ్య, అంజయ్య, తిరుపతయ్య, లాలయ్యగౌడ్, చరమందగౌడ్, అశోక్, కృష్ణ, మల్లయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన అవసరం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు

కడ్తాల్: 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు కొత్త ఓటరు నమోదు, బూత్‌స్థాయి ఓటరు మార్పులు చేర్పులపై, సంబంధిత అధికారులు అవగాహన సదస్సు నిర్వహించాలని, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్ శనివారం తహసీల్దార్ షేక్ ముంతాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భానుకిరణ్ మాట్లాడుతూ.. అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టాలని, వేర్వేరు పోలింగ్ బూత్‌ల్లో ఉన్న ఓటును, వాళ్ల కుటుంబ సభ్యులు ఉన్న బూత్‌లలోకి మార్చాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన తహసీల్దార్, రెండు మూడు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, యువతీ, యువకులు అందుబాటులో ఉండాలని, ఓటరు నమోదు, మార్పు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే ఎద్దైనా మార్పులు చేర్పులు ఉంటే సవరణ చేసుకోవాలని సూచించారు. ఫారం-6 నింపి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఫారం-6బీతో ఆధార్‌లింక్, ఫారం-8 నింపి ఓటరు కార్డులో మార్పులు, సవరణలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేశ్, ఇమ్రాన్,రవి, శ్రీకాంత్,విజయ్, పాండు, చంద్రశేఖర్, శ్రీకాంత్, శేఖర్‌యాదవ్, అంజి, సురేశ్, నరేశ్ ఉన్నారు.

కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తాం

● పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకర్గంపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సంఘాయిపల్లి గేట్ వద్ద ఓ ఫాంహౌస్‌లో పార్టీ మండలాధ్యక్షుడు దోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసామూర్తి, రాములు, డేవిడ్, శ్రీశైలం, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

● ఎంపీపీ సుకన్య



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: గ్రామాల్లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం డాక్టర్ సుప్రిత ఆధ్వర్యంలో గురునానక్ హోమియోపతి ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ వైద్య శిబిరానికి 250 మంది వరకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నాణ్యమైన వైద్యం చేయడంతో పేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. డాక్టర్ సుప్రిత్ మాట్లాడుతూ.. ప్రతి శనివారం యాచారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, యాచారం గ్రామ సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ లలిత, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య పాల్గొన్నారు.

మొక్కల పెంపకాన్ని బాధ్యతగా గుర్తించాలి

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా విరివిగా మొక్కలు నాటాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం గ్రామంలో శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటే విషయంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరిస్తే భవిష్యత్తు తరాలకు మేలు చేసిన వారం అవుతామన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఉమారాణి, సర్పంచ్ ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశవర్కర్ల డిమాండ్లను నెరవేర్చండి

● సీఐటీయూ నాయకుడు కురుమయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు, తదితరులు

తలకొండపల్లి: ఆశవర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సమస్యల సాధనకు ఆశవర్కర్లు రెవెన్యూ కార్యాలయ ఆవరణ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కురుమయ్య మాట్లాడారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు, తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఏరియర్స్, కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ. 1000 చొప్పున 16 నెలల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. 32 రకాల రిజిస్టర్స్‌ను ప్రభుత్వమే ప్రింట్ చేసి ఇవ్వాలన్నారు. ప్రసూతి సెలవుల సర్క్యులర్ వెంటనే జారీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సుజాత, రజిత, రాణిబాయి, లక్ష్మి, మహేశ్వరి, శిల్ప, చంద్రకళ, శివజ్యోతి, శ్రీదేవి, పుష్ప, చంప్లి పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్లు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలకు కనీస వేతనం రూ. 18 వేలు పెంచాలని, మెడిసిన్ డబ్బాలను ఆశవర్కర్లతో మోపించొద్దని, టీబీ, కంటి వెలుగు పథకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కరోనా అలవెన్స్‌లను విడుదల చేయాలని కోరారు. ఆశవర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటూ, సరైన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వైద్య సేవల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పని చేసే ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. అనంతరం మంచాల తహసీల్దార్ వెంకట ప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలన్నారు. ప్రసూతి సెలవులకు సంబంధించిన సర్క్యూలర్‌ను వెంటనే జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు నవనీత, పారిజాత, అమృత, సునంద, జయమ్మ, జ్యోతి, ప్రియాంక, పారిజాత పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

ఎమ్మెల్యేపై ప్రజల్లో వ్యతిరేకత

● టికెట్ కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలి
● మరోసారి సర్వే చేయించి గెలిచే వారికే అవకాశమివ్వాలి
● నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్



విలేకరులతో మాట్లాడుతున్న బాలాజీసింగ్

ఆమనగల్లు: కల్వకుర్తి బీఆర్ఎస్ టికెట్ ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఇవ్వడంపై అధిష్టానం పునరాలోచించాలని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులను ఎమ్మెల్యే ఏనాడూ గుర్తించలేదని ఆరోపించారు. తాను పదహారేళ్లుగా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన అభయం మేరకు విదేశాల నుంచి వచ్చి.. పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశానని తెలిపారు. ఏనాడూ పార్టీ ఆదేశాలను ధిక్కరించలేదని స్పష్టంచేశారు. నియోజకవర్గ ప్రజల్లో ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. నామినేటెడ్ పదవులను తన అనుచరులకే కట్టబెట్టాడని ఆరోపించారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుండగా.. కల్వకుర్తి మాత్రం ఇందుకు నోచుకోలేదని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారుల అభిప్రాయాలను తెలుసుకోకుండానే అధిష్టానం మరోసారి ఆయనకు టికెట్ ఇవ్వడంపై ఆందోళన వ్యక్తంచేశారు. మరోసారి సర్వే చేయించి.. విజయం సాధించేవారికే పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అందరి అభీష్టం మేరకు పార్టీ పెద్దలు పునరాలోచన చేయకపోతే.. తమ భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పగడాల రవితేజ, మాజీ సర్పంచ్ సూదిని కొండల్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మిద్దె రాములు, సాయిరెడ్డి, మసున విష్ణు, పల్లె జంగయ్య, తిరుపతయ్య, శ్రీనివాస్‌గౌడ్, కంచర్లగిరి, చంద్రయ్య, కోటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో జాప్యం

యాచారం: ఆసరా పింఛన్ పంపిణీలో తీవ్రజాప్యం జరుగుతోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం యాచారం తపాలా కార్యాలయంలో ఫినో మిషన్‌కు సిగ్నల్ అందకపోవడంతో పింఛన్ డబ్బు ఇవ్వడం కుదరలేదు. దీంతో యాచారం గ్రామానికి చెందిన వంద మందికి పైగా తపాలా కార్యాలయం ఎదుట పడిగాపులు కాశారు. సాయంత్రం సిగ్నల్ అందడంతో పింఛన్ పంపిణీ చేశారు.

తలసానికి సన్మానం

ఇబ్రహీంపట్నం రూరల్: పశు సంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి శనివారం ఘనంగా స్వాగతం పలికారు. ఇబ్రహీంపట్నం పర్యటనకు వచ్చిన మంత్రికి శాలువా కప్పి ఆహ్వానించారు.



మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న బూడిద రాంరెడ్డి

సంక్షిప్త వార్తలు

● రామాలయంలో అన్నదానం

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని కవాడిపల్లిలో కోదండ రామచంద్రస్వామి దేవాలయంలో శనివారం యాదాద్రి ఏసీపీ, కవాడిపల్లి గ్రామ నివాసి అయిన కొలన్ శివరాంరెడ్డి-లావణ్య దంపతులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ దూసరి సుజాతయాదయ్యగౌడ్‌లతో పాటు గ్రామస్థులు హాజరయ్యారు. గ్రామంలోని దేవాలయంలో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడంలో భాగంగానే ఏసీపీ శివరాంరెడ్డి దంపతులు కూడా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.

● గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలి

మంచాల: గ్రామాల్లో ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఏపీడీ నీరజ అన్నారు. శనివారం స్వతంత్ర్య వజ్రోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమం మంచాల పోల్కమ్మ చెరువు కట్టపై నిర్వహించారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిలుకూరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఈసీలు, టీఏలు పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో భా గంగా శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో కోటి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మైసిగండిలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ తులసీరాంనాయక్, కార్యదర్శి సత్యం, నాయకులు జవహర్‌లాల్, రాందాస్ తదితరులు ఉన్నారు.

● సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా..

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని బీసీకాలనీలో హోలియా దాసరి సంఘం కమ్యునిటీ భవన నిర్మాణానికి శనివారం దాసరి సంఘం నాయకులకు రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేయడానికి ఐక్యత ఫౌండేషన్ స్థాపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, దాసరి సంఘం అధ్యక్షుడు బిట్టు రాములు, నాయకులు సత్య నారాయణ, రాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

● తహసీల్దార్ ముంతాజ్‌కు సన్మానం

కడ్తాల్: మండల కేంద్రానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్ ముంతాజ్‌ను శనివారం సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి , గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు గణేశ్, మల్లయ్య, భిక్షపతి, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు యాదగిరిరెడ్డి,రాంచంద్రయ్య, శ్రీను, రమేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఉన్నారు.

● అభయ ఫౌండేషన్ సేవలు మరువలేనివి

తుర్కయంజాల్: ఆర్టీఏ కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారికి సౌలభ్యంగా ఉండేలా భవన నిర్మాణం చేపట్టడానికి ముందుకు వచ్చిన అభయ ఫౌండేషన్ వారి సేవలు మరువలేనివని ఇబ్రహీంపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం అధికారి రఘునందన్ గౌడ్ తెలిపారు. శనివారం అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీఏ కార్యాలయంలో 2400 స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టనున్న పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునందన్ గౌడ్ మాట్లాడుతూ.. అభయ ఫౌండేషన్ గడిచిన కొన్నేళ్లుగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 25 రోజుల పాటు ఉచితంగా వసతి సౌకర్యాన్ని కల్పించి డ్రైవింగ్‌లో శిక్షణ, సెల్‌ఫోన్ రిపేరింగ్, కంప్యూటర్, టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. కార్యాలయానికి ప్రతి రోజు సుమారు 1000 మంది వరకు వస్తుంటారని, ఎండాకాలం, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది , ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.